ఆడవాళ్ళ అంతరంగం



మధురాంతకం రాజారాం

పదిహేనేళ్ళకు మునుపు చలపతి ఎవడో నాకు తెలియదు. నాకు కనిపించినప్పటికే అతడు ముప్ఫయి యేళ్ళవాడు. జిల్లా ముఖ్యపట్టణం కావడాన మా వూళ్ళో బోలెడన్ని ఆఫీసులున్నాయి. అయిదారు హైస్కూళ్ళున్నాయి. వ్యాపార సంస్థలున్నాయి. అప్పటికే ఒక కాలేజీ గూడా వెలిసింది. ఇంతమంది జనం యిక్కడున్న తర్వాత చుట్టపు చూపులకని, శుభాశుభ కార్యాలకని వచ్చేపోయే జనం మాత్రం తక్కువగా వుంటుందా? అందువల్ల హమేషా మాకు కొత్త ముఖాలు కనిపించడం పరిపాటే! కానీ కనిపించగానే యిత దెవడై వుంటాడబ్బా అంటూ విచికిత్సకు దిగవలసిన ప్రత్యేకత ఏ కొద్ది ముఖాల్లో మాత్రమో వుంటుంది. చలపతిని చూడగానే నేనలాగే అనుకున్నాను. మనిషి పొడుగరి. కోరమీసాలు, చంగులు జీరాడే పంచకట్టుతో, ఉల్లిపొరలాంటి లాల్చీ హొయలుతో, గుబురుగా గిరదాలాగా వెనక్కు వంగిన క్రాపింగుతో అతడిదంతా ఒక పిన్నపాళెగాడి వాలకం. మొదటిసారిగా బజారులోనూ, తరువాత హోటల్లోనూ కనిపించి, మూడోసారిగా అతడు నాకు మా వీధిలోనే ఎదురయ్యాడు.

ఆరోజు ఎనిమిది గంటలప్పుడు "ఎదురింటి కెవరో కొత్త వాళ్ళొచ్చారండీ!" అంది శారద.

ఆఫీసులో ఉద్యోగ నిర్వహణకు, ఇంటి దగ్గర వున్నప్పుడు గృహకృత్యాలు నిర్వర్తించడానికి, సాయంకాలాల్లో షికారు వెళ్ళిరావడానికి, యిలా అనుదిన వ్యాసంగాల చుట్టూ ఒక గిరి గీసుకుని కూర్చున్న నాకు మా వీధి సాంఘిక జీవితంతో అట్టే ప్రసక్తిలేదు. మా శారద సంగ

తలా కాదు. బ్రతుకులో సంచలనం లేక పోతే ఆవిడకు మతి పోయినంత పనవు తుంది. ఆ వీధిలో కాపురం పెట్టిననాటికి అక్కడ మాకు పుచ్చు కొక్కడైనా పరి చితులు లేరు. అలాంటిచోట అనతి కాలంలోనే మా ఆవిడకు అక్కలు, అత్తలు, పిన్నిగార్లు, వదినెలు, ఆడపడు చులు అసంఖ్యాకంగా పుట్టుకొచ్చేశారు. ఆ కొత్త చుట్టరికాలకు అనుగుణ్యంగా నేను కొందరికి అల్లుడి నయ్యాను. కొందరికి మరిది నయ్యాను. కొందరికి బావగారి నయ్యాను, కానీ మా వీధి కంతటికీ జెన్రల్‌గా శారదమ్మ మొగుడిగామాత్రమే వుండిపోయాను! మా శారద నిర్వాకం గురించి యింతదూరం ఎందుకు చెబు తున్నానంటే ఎదురింటి కెవరో కొత్త వాళ్లు వచ్చారని తెలుసుకోడంతో ఆమెకు తృప్తికలిగి వుంటుందన్న నమ్మకం నాకు లేదు. వాళ్ళను గురించి మరికొన్ని వివరాలు తెలుసుకోనిదే ఆమెకు నిద్ర పట్టదు. నా వూహ కరెక్టు. శారద కొన సాగించింది.

"యింకా సామాన్లన్నీ తెచ్చుకో లేదట: ఎదురింటావిడ బకెట్టుకోసమని మనయింటికే వచ్చివెళ్ళింది లెండి! వాళ్ళ దసలు ఈ జిల్లా కాదట. హిందూపురం దగ్గర అదేదో వూరిపేరు చెప్పింది. అక్కడాక ఆఫీసులో పని చేస్తుంటే నేమో, ఆ ఆఫీసరుగారు వీళ్ళింటాయ నంటే కళ్ళల్లో నిప్పులు పోసుకునే వాడట! ఈయనేమో సాదా గుమాస్తా అయిపోయాడు. ఐనా ఆఫీసుకొచ్చిన వాళ్ళందరూ ఈయన దగ్గరకు రావడమే! ఈయనచుట్టూ మూగడమే ఈయన్ను ఘనంగా పొగడ్డమే! ఎంత చచ్చు ఆఫీ సరుకైనా ఒళ్ళు మండదటండీ! అతగా డీయన్ని దూరంగా ఎక్కడికైనా బదిలీ చేయమని పైవాళ్ళకు రిపోర్టు రాసి పడేశా డట! అలా కొట్టుకొచ్చారటండీ పాపం!"

భర్తను గురించి భార్య యిచ్చే స్టేట్ మెంటులో నూటికి నూరుపాళ్ళు నిజమే వుంటుందనుకోడానికి వీల్లేదు. ఎదురింటా విడ శారదకు తెలిపిన వర్తమానాన్నిబట్టి చూస్తే ఆమె భర్తను వెనకేసుకరావడం స్పష్టంగానే కనిపిస్తోంది. తన భర్త మామూలు గుమాస్తామాత్రుడేనని ఆమె చెప్పనే చెప్పింది. మరైతే ఆఫీసుకొచ్చిన వాళ్ళకందరికీ అతడితోనే ఏంపని? వా ళ్ళడపా దడపా ఆ ఆఫీసరుగారి ముఖాన్ని గూడా చూచిపోతుంటే ఆయనకలా ఆగ్రహం కలిగేది కాదుగదా! ఐనా గుమాస్తా సీటులో కూచుని యితడు ఆఫీ సరుగారి ప్రాధాన్యాన్ని ఎలా హరించ గలిగినట్టు? ఈ ఎదురింటావిడి ఎవరో గానీ, ఈమె తన భర్తను సమర్థించుకో డానికి యింతకంటే కట్టుదిట్టమైన సంజా యిషీ ఓ పొందించుకుని వుండవలసింది.

మరునాటి వుదయం టూత్‌పేస్టు నుర గలు పెదిమలకు బాగా అంటుకపోవడం వల్ల హనుమంతుడి వేషం వేసినట్టున్న

కోరమీసాల వ్యక్తి ఎదురింటి వసారాలో ప్రత్యక్షమయ్యాడు.

"ఓహో, యితడే శాటోలు ఎదురింటావిట భర్త అనుకున్నాను. అతడి పేరు చలపతి అనీ, ఏదో ప్రభుత్వ కార్యాలయంలో పనిచేస్తున్నాడనీ తరువాత తెలిసింది.

ఒక మట్టిగుట్టపైన హఠాత్తుగా ఒక దేవుడి విగ్రహం పుట్టుకొస్తే చెలరేగే సంరంభం ఎలాంటిదో తమకు తెలుసు. సరిగ్గా అలాగే చలపతి ఎదురింట్లో చేరినప్పటినుంచీ మా వీధికొక గుర్తింపు రావడం నేను గమనించాను. అప్పట్లో వుండివుండీ కొన్ని వీధిలో కొత్త ముఖాలు కనిపిస్తుండేవి. ఎదురింటి వసారాలో మనుషులు తచ్చాడుతూ వున్నట్టయితే అది చలపతి యింటిలోపల వున్నాడనేందుకు గుర్తు. వసారా నిర్జనంగా వున్నట్టయితే చలపతి యింట్లో లేనట్టు లెక్క. ప్రశస్తి హెచ్చిన కొద్దీ తీర్థానికి యాత్రీకు లెక్కువగా రావడం సహజమే! రానురాను చలపతికోసం వచ్చిపోయే వాళ్ళ సంఖ్య సైతం పెరగసాగింది. తీరికవేళల్లో ఎప్పుడైనా వీధిగుమ్మంలో నిల్చుని రోడ్డువైపు చూస్తుంటే ఎవడో ఒక ఆగంతకుడు నికరంగా నాతోనే పనివున్నవాడిలా దగ్గరకు వచ్చి "బాబూ! చలపతిగారి యిల్లెక్కడండీ?" అనేవాడు. చలపతి యిలా చాలామందికి దర్శనీయుడు గావడంలో నాకు ఎట్టి ఆక్షేపణా లేదు. అతడింట్లో వున్నంతసేపు మూల విరాట్టుగానూ, బయటకు వెళ్ళివప్పుడు ఉత్సవ విగ్రహంగానూ భావింపబడడం గూడా నాకిష్టమే! కానీ యిందువల్ల మొదట మనసు కాస్తా చివుక్కుమన్నది మా శారదకే!

ఓ రోజామె వుండబట్టలేక అనేసింది గూడా:

"ఇదికాదండీ! ఏమిటో బాబూ, మీరు వున్నారు! మనకూ పెళ్ళయి యిది మూడోయేడో, నాలుగో యేడో జరుగుతోంది. ఇంతకాలంగా చూస్తున్నాను కదా! మీకోసమని పనిగట్టుకుని ఒక పెద్దమనిషి అయినా యింటి దగ్గరికి వచ్చిన పాపాన పోలేదు. ఆచలపతి అనే ఎదురింటాయనా వున్నాడు. ఆయన కోసం వచ్చేవాళ్ళతో, పోయే వాళ్ళతో వాళ్ళింటి వసారా ఒక వరస అరిగిపోయింది గదండీ!"

"అవున్నిజమే శారదా!" మారు మాటలేకుండా ఒప్పేసుకున్నాను. 'కొందరు యోగ జాతకులుంటారు. మచ్చు మందు చల్లినట్టుగా వాళ్ళచుట్టూ జనం మూగి పోతూ వుంటారు. మిగిలిన వాళ్ళు డబ్బిచ్చి పిలిచినా వచ్చే వాడుండడు. ఏం చేద్దాం చెప్పు. చలపతి అలాంటివరం అడి గొచ్చాడు. మనం యిలాంటి శాపం పొంది వచ్చాము. చేసుకున్న వాళ్ళకు చేసుకున్నంత అని

పూరికేనా అన్నారా పెద్దలు!''

పాత గ్రంథాల్లోని పడికట్టు మాటల దైలాగ్సంటే—శారదకు చాలా యిష్టం. అందుకని ఆమెకు అర్థమయ్యే భాషలో, నచ్చే పద్ధతిలోనే నేను నా వాదాన్ని రూపొందించాను. కానీ ఎందుచేతనో నేను తనను పరిహాసం చేస్తున్నట్టుగా శారదకు ధ్వనించింది. మరేమీ అనలేక ఆమె నావైపొక క్షణం కొరకొర చూచి లోపలికి వెళ్ళి పోయింది.

ఈ బెడద యింతటితో తీరిపోయే దిలా కనిపించలేదు.

నెలరోజులు తిరగక మునుపే మళ్ళీ ఒకసారి నాపైన మెరపు దాడిలా విరుచుక పడింది శారద.

''ఏమండీ! మనకు పెళ్ళయినప్పటి నుంచీ చెబుతున్నాను. మీరేమైనా నా మాట వినిపించుకున్నారా? ఆ ఎదురింటా యన్ను చూడండి. కాపురంపెట్టి యింకా రెండు మాసాలైనా కాలేదు. అప్పుడే తెప్పించి హాల్లో వేయించేశాడు ...''

నాపరాయా. చట్టు బండా అని మన సులో మాత్రం అనుకుని ''ఏమిటి శారదా వేయించింది?'' అన్నాను.

''అదే పట్టెమంచం! అంతాటేకు కొయ్యే! ఆ నవారు మాత్రం? ఎంత పొంకంగా కుదిరిందనీ! ఒక్కసారిగా యిద్దరు ముగ్గురెక్కి తొక్కినా దానికేం దోకా వుండదు....''

''అలాగా! చలపతి పట్టె మంచం కొన్నాడా శారదా! మనదేం పోయింది. కొననివ్వు! ఎంతగా నేను బడి పంతుల్ని అయినా ఒక పట్టె మంచం కొనలేననా నీ వుద్దేశం? అబ్బే, నువ్వొక్కనాటికీ అలా అనుకోవద్దు. మనం కొంటాం. కొని తీరుతాం. లేదంటే కొత్త స్కేలు కాస్తా అమల్లోకి రావాలంతే! నువ్వు చూస్తునే వుండు. అయిదారు మంది ఎక్కి చెడ త్రొక్కినా విరిగిపోని పట్టె మంచం నేనే కొంటాను. దానిపైన నువ్వే పడుకుంటావు'' అన్నాను. (అన్నానా, ఓదార్చానా?)

శారద తెల్లబోయింది. ఈ మనిషి మాటలతో మనకేం లెమ్మన్నటు తన పాటుకు తాను వెళ్ళి పోయింది.

నేను కొన దలచుకున్న గృహోపక రణ సామగ్రిలో పట్టె మంచం ఒకటి. ఎదురింటి చలపతి కొనగలిగిన వస్తువుల జాబితాలో అది మొదటిది గావడం నా దురదృష్టం. అంతేగాదు,అతడి జాబితా చాలా పెద్దదని నాకు కాలక్రమాన తెలిసి వచ్చింది. ఆ జాబితాలో రెండోది స్టీలు బీరువా. నేనైతే దాని అంద చందాలను తిలకించలేదు. చూచి వచ్చిన శారద చెప్పగా విన్నాను. అది బాగా పొడుగైన మనిషికన్నా ఎత్తుగా వుంటుంది. అయి దరలున్నాయి. మధ్యలోవున్న అరకు ప్రత్యేకంగా తాళం పెట్టు కోవచ్చు. విలువైన వస్తువులు పెట్టుకోడానికి ఆ సొరుగులో మళ్ళీ ఒక రహస్యపు



సొరుగు వుంది. వెలగూడా తెలుసుకోకుండా రాలేదు శారద. అయిదు పచ్చనోట్లు తమవి కావనుకుంటే ఎవరైనా అలాంటి బీరువాకొనుక్కోవచ్చు.

అయిదు వందల రూపాయలుపెట్టి బీరువా కొనుక్కోదలచుకుంటే నన్నడుకునే లౌకికశక్తి ఏదీలేదు. కానీ నాకున్న సమస్య ఆమాత్రం డబ్బును మిగిలించడమే! ఐతే నాకున్న ఈ యిబ్బందిని యిప్పుడు శారద సానుభూతితో అర్థం చేసుకోగలదని అనిపించడంలేదు. ఇప్పుడామె ఎదురింటి చలపతి ప్రయోజకత్వానికి నాతాహత్తును పాటా వేసి చూచే ప్రయత్నంలో వుంది. పట్టె మంచానికి వేసిన నవారు మాసి పోకమునుపే చలపతి ఉక్కు బీరువా కొనుక్కోగలిగాడు. నేనింకా మొదటి దానికే దారి దొరకని దుస్థితిలో వున్నాను.

ఇందులో యింకొక చిక్కుగూడా వుంది. చలపతి గనుక ఓ గెజటడ్ ఆఫీసరై వుంటే శారద నన్నతడితో పోల్చి చూచి కించ పరిచి వుండేదిగాదు. మా ఆర్థికస్థాయి యించుమించుగా సమానమే! ఇద్దరిలోనూ ఒకరు సునాయాసంగా చేసి పారవేయగల పనిని మరొకరు గిపెట్టి గింజుకుని గూడా చేయలేక పోతున్నారంటే అర్థమేమిటి? ఒక్కమా శారదేగాదు. ఇలాంటి పరిస్థితిలో మా శారదలాంటి ఆడవాళ్ళెవరైనాసరే, తమ భర్తల తాహత్తును శంకించే ఆస్కారముందనే నేను భావిస్తాను.

లోకంలో ఎవరేమైపోతే మనకేం లెమ్మనుకుని వూరుకునే వాణ్ణి. నేనిక్కడొక చిన్న యిన్వెస్టిగేషనుకు పూనుకున్నాను. చలపతి ఏ ఆఫీసులో పనిచేస్తున్నాడో తెలుసుకున్నాను. అతడి చుట్టూ చేరుతున్న వాళ్ళెవరో ఆరాతీశాను. అజ్ఞానపుతెర తొలగిపోయే సరికి ఆత్మ

సాక్షాత్కారం సాధ్యమైనట్టుగా చలపతిని గురించిన నిజాన్ని యిట్టే పట్టేయగలిగాను. చలపతి వ్యాపార సాపారాలపైన పన్నులు విధించి, వసూలుచేసే కార్యాలయంలో పనిచేస్తున్నాడు. ఆవిధంగా వ్యాపారస్తుల ఆయువుపట్లన్నీ అతడి గుప్పిట్లో వున్నాయి. వాణిజ్యం న్యాయ సమ్మతంగానే జరిగి తీరాలన్నది చలపతి అభిమతంగాదు. దీని కంటూ ఆఫీసుల్ని ఏర్పాటుచేసి, యింత సిబ్బందిని పోషిస్తున్నది గనుక ఈ డిపారుమెంటు వల్ల ప్రభుత్వానికి న్యాయం చేకూరాలన్న మొగ మాటంగూడా లేదు. తన స్వంత లాభానికీ పుష్టి, తుష్టి చేకూరు తున్నంత వరకు అతడాఫీసరుగారి కొక్కరికి మాత్రమే విధేయుడు. ఆఫీసరుగారు స్వయంగా రంగంలోకి దిగగూడదు. సర్వాధికారాలతో యితడు తన ప్రతినిధిగా వ్యవహరించడానికి ఒప్పుకోవాలి. ఇలా ఆఫీసరుగారు బుద్ధిగా మసలుకునే పక్షంలో చలపతి ఆయన వాటా ఆయనకు ముట్ట జెబుతాడు. తన వాటా తాను జేబులో వేసుకుంటాడు.

మునుపటి కెవడో శాస్త్రజ్ఞుడిలాగ యురేకా, యురేకా అని అరవాలనిపించింది నాకు! అంతటి ఉత్సాహంతోనూ యింటి ముఖం పట్టాను. శారదను దగ్గరగా కూచో బెట్టుకుని విషయాన్ని సవిస్తరంగా వెల్లడించాను. "ఓహో అలాగా! ఇంత అన్యాయమా! అబ్బే, అదేం బ్రతుకండీ...." శారద నోటి గుండా యిలాంటి మాటలొస్తాయనే ఆశించాను. అలా జరగలేదు. నేనేమో అయ్యవారినే చేయబోయాను. అదికాస్తా కోతిగా తయారై కూచుంది.

ఎలాగంటారా!

నామాటల్లోపసదనమనేది మాశారదకు కంచుకాగడా వేసి వెదికినా కనిపించినట్టు లేదు. అప్పటికి నేననవసరంగా ఏదో గొడవ చేస్తున్నట్టు ఆమె నావైపు అయోమయంగా చూచింది.

"అదికాదండీ! సుఖంగా బ్రతకడం మనచేత గాదు. ఆవిషయం ఏనాడో ఋజువైపోయింది. మనం మనకోరికల్ని తీర్చుకోలేం. ఏదో దొరికింది తింటాం. మనుషుల్లా యిలా వుంటాం. లేదంటే రెండేళ్ళకొకర్ని లెక్కన కంటాం. ఈ మాత్రానికి మనకులేని పోని సోదెలు గూడానా! ఒక యిల్లాలు మొగుడు కొట్టినందుకు గాకుండా యితరులు నవ్వినందుకేడ్చిందట! మీ ఎవ్వారం గూడా అలాగే వుంది. మన మెలాగూ సంపాదించలేం. ఎవరో యింకొకరు సంపాదిస్తుంటే మనకీ వుడుకు మోత్తనం ఎందుకో! చాల్లే, వూరుకోండి...."

ఊరుకోక నేను చేయగలిగిందేముంది? నీళ్ళు చల్లితే మంటలు ఆరిపోవచ్చునని నేననుకున్నాను. నేను చల్లింది ఆజ్యమని తీరా చల్లిన తర్వాత తెలిసింది.

ఎలా గైతేనేం, అప్పటి నుంచీ శారద ఎదురింటి వాళ్ళ ప్రసక్తిని తీసుక రావడం తగ్గించేసింది.

అయిదారు నెలలలా గడిచిన తర్వాత హఠాత్తుగా చలపతి యిల్లు ఖాళీ చేసేయ బోతున్నాడని తెలిసేసరికి నాకు అపరిమితమైన ఆనందం కలిగింది.

"మార్పుకేం చేస్తారెండి!" అంటూ నిట్టూర్పింది శారద.

"ఏంశారదా! ఏంకష్టం వచ్చింది వాళ్ళకు?" అన్నాను.

"ఊఁహూ! వాళ్ళకు కష్టం వస్తుందనేనా మీ ఆశ! భలే వారేనే! వాళ్ళకెందు కొస్తాయండీ కష్టాలు? అదేం లేదు. అసలేం జరిగిందంటే ఈ మధ్య రెండు మూడు బుట్టల నిండుకూ స్టీలు సామాన్లు కొనేశారు. ఓ డజను కుర్చీలు, ఓ డైనింగు టేబిలుకొని రెండు మాసాలైంది. వాటినన్నింటినీ సర్దిపెట్టుకోడానికి తావుండొద్దా? డెబ్బయి అయిదు రూపాయలకు పక్కవీధిలోనే యిల్లు కుదిరిందట! వెళ్ళిపోతున్నారు. నన్నొదిలిపెట్టి వెళ్ళవలసి వచ్చినందుకు పద్మక్కకు మనసు మనసులో లేదనుకోండి! మాటి మాటికీ వచ్చిపోతుండమని మరిమరీ చెప్పింది..."

శారద తప్పకుండా వెళ్ళవలసిందే! కొత్త యింట్లో చలపతి స్టేటస్ మరింతగా పెరుగుతుంది. అతడు పెళ్ళానికి ఏడు వారాల సొమ్ములు చేయించినా చేయిస్తాడు ఆ యిల్లొక ప్రదర్శనాలయమై తీరుతుంది. ఆ ప్రదర్శనం తిలకించడానికి శారదలాంటి ప్రేక్షకు లెందరైనా అవసరమే!

ఆ మాటకొస్తే మా శారదతోబాటు నేను గూడా వొక ప్రేక్షకుణ్ణిగాకపోలేదు. ఐతే నన్నాకర్షించింది చలపతి భోగభాగ్యాలుగావు నేనుప్రేక్షకుడుగా చూడ తలచుకున్నది అతడి జీవిత నాటకాన్ని! నా మట్టుకు నాకు అదెంతో రసవత్తరంగా వుంది. చిన్న ఉద్యోగం, పెద్ద సంపాదన. ఎలాంటి పనైనా చిటికెలో చేసేయగల పలుకుబడి. బజారులో వెళ్తుంటే "రాజాధి రాజ, రాజ గంభీర" అంటూ కైవారాలు వెలువడక పోవడమొకటే కొరత. బాగుంది, చాలా బాగుంది. ఇంతకంటే ఏ నాటకం మాత్రం పసందుగా వుంటుంది?

జీవితం వొక నాటకం లాంటిది గనుక యిందులోనూ కొన్ని అనుకోని మలుపులు పుట్టుకరావడం సహజం. రెండు మూడేళ్ళ తర్వాత ఒక గాలి కబురు నా చెవిలో పడింది. చలపతి కీర్తి రాష్ట్ర ముఖ్యనగరం దాకా ప్రాకిందట! పై అధికారులు యింతటి ప్రయోజకుణ్ని భరించడం తమ డిపార్టుమెంటువల్ల సాధ్యంకాదని తలపోస్తున్నారట! కొద్ది రోజుల్లో పోస్టింగు రావచ్చునని తెలిసింది.

ఆశ్చర్యమేమిటంటే దీన్ని సైతం మా శారద ఒక విషాద వార్తగా తీసుకో

లేదు.

"పద్మక్క చెప్పింది లెండి! కాస్త పచ్చగావున్న వాళ్ళను చూస్తే లోకులకు మనసొప్పుతుందా? అలాంటివాళ్ళెవరో లేనివి పోనివన్నీ జతచేసి చలపతిగారి పైన పిటిషన్లు పెట్టేశారట! అక్కడెక్కడో హైద్రాబాదులో కూర్చున్న వాళ్ళకేం తెలుస్తుంది? ఇక్కడొక ఖాళీ ఏర్పడితే తమ వాళ్ళ నెవళ్ళనైనా అందులో పడెయ్యవచ్చునని వాళ్ళ ప్లానట! అందుకని వాళ్ళు గూడా ఈయన పైన పగబట్టి "వుంటావా, పూడతావా" అని బెదిరిస్తున్నారట! కానీ చలపతిగారు కూడా ఏమంత చేతగాని వాడు కాదు లెండి!"

"ఏం చేస్తాడట శారదా?"

"ఏం చేస్తాడు! రాజీనామా రాసి వాళ్ళ ముఖాన కొడతాడు ..."

"కొట్టి?"

"ఏదైనా బిజినెస్ పెట్టుకుంటాడు. అప్పుడే నలుగురు రైదుగురు పెద్దమనుషులు పార్ట్‌నర్స్‌గా వుండడానికి మేమంటే మేమని ముందుకొస్తున్నారుట ..."

పైన్నుంచి పోస్టింగు ఆర్డరేవచ్చిందో, లేకపోతే యితడే రాజీనామా వ్రాసి పడేశాడో నాకు తెలియదు. మొత్తానికి వుద్యోగం వూడింది. ఆ విషయం ముందుగానే తెలిపి, అందుకు చలపతి సిద్ధమైవున్నాడనేందుకు నిదర్శనంగా కొద్ది నెలల్లో పట్టణంలో ఒక కొత్త హోటలు వెలసింది. ప్రారంభోత్సవం నాడు నేనూ వెళ్ళి చూచాను. చిరునవ్వులు వెలుగుతున్న ముఖంతో గల్లాపెట్టె దగ్గర కూర్చున్న చలపతి నాకు సుస్వాగతం పలికాడు.

"రండి రండి కృష్ణమూర్తిగారూ! అనుభవం చాలనివాణ్ణి. ఇందులో దిగేశాను దీనికైనా నా దగ్గర డబ్బెక్కడిది? పెట్టుబడి షెట్టిన మహారాజులు వేరే వున్నారు. వాళ్ళకు నా పైన ఎంత విశ్వాసం, ఏం కథ! ఈ బిజినెస్సులో బుడుంగున మునిగిపోకుండా మేము పైకి తేలడం మీలాంటి వాళ్ళపైన ఆధారపడి వుంటుంది. మీరు తరచుగా వచ్చిపోతుండాలి. ఇంకా మీ స్నేహితులతో గూడా చెప్పండి. జేబులో డబ్బుండి తీరాలన్నదేం లేదు. అకౌంట్‌లు పెట్టించుకోవచ్చు .."

ముచ్చటగొలిపే చలపతి ఆతిథ్య మర్యాదల్ని స్వీకరించడానికైనా తరచుగా ఆ హోటలుకు వెళ్తూవుండాలనిపించింది. రేట్లు కాస్తా ఎక్కువే ననుకోండి కానీ సదుపాయాలు దివ్యంగా వుండేవి. హాల్లో వేడి వేడిగా కాఫీ, తేనీరులాంటి పానీయాలు, లోపలి గదుల్లో శరీరాని కంతకంతే వేడియిచ్చే పానీయాలు దొరుకుతుండేవి. ఇరవై నాలుగ్గంటలూ పేకాట కొనసాగే రహస్యాగారం ఒకటి ఆ హోటల్లోవుందని గూడా విన్నాను.

ఐనా ఆ హోటలు గొడవలన్నీ మన కెందుకు? దానివల్ల చలపతికి ఏ మాత్రం లాభించిందన్నదే ప్రధానం. ఇంతకు మునుపు చలపతి చేసిన గవర్నమెంటు ఉద్యోగంలాగే ఈ హోటలు గూడా అదృష్టవంతు డెక్కడికి వెళ్ళినా బాగుపడ కుండా వుండడనే నిరూపించింది. కాఫీ పైకం మినహాయించుకుని చిల్లర డబ్బు లివ్వడంకోసం చలపతి పెట్టె తెరచినప్పుడల్లా నాకాగల్లా పెట్టె వొక చిన్న సైజు ధనలక్ష్మి కొలువుకూటంలా కనిపించేది.

ఆ హోటలు వ్యాపారం రెండు మూడేళ్ళపాటు దేదీప్యమానంగా సాగి పోయింది.

ఆ మధ్య ఒకసారి శారద "ఏమండీ! మీకొక రహస్యం చెప్పనా?" అంది.

శారదకు రహస్యం చెప్పేవాళ్ళెవరైతే వున్నారో వాళ్ళు శుద్ధ తెలివి తక్కువ వాళ్ళని నా వుద్దేశం. ఏమంటే ఆమె నోటిలో నువ్వుగింజ నానదు. కనీసం నాకైనా ఆ రహస్యం చెప్పేస్తుంది.

"పద్మక్క మీక్కూడా చెప్పొద్దంది లెండి! మరేంలేదు, చలపతిగారు అయిదు వేలుపెట్టి ఓ రవ్వల నెక్లెసు చేయించాడు. ఎంత బాగుందనుకున్నారు!"

"ఎందుకు బాగుండదూ? అయిదు వేలా, మజాకానా? తప్పకుండా బాగుంటుంది" అన్నాను.

"మరి.... హోటలుకు పెట్టుబడిపెట్టిన వాళ్ళున్నారే, వాళ్ళు చాలామంచివాళ్ళని మన మనుకున్నాం. ఎంత పొరబాటో చూచారా! తెల్లనివన్నీ పాలనుకో గూడదు. వాళ్ళవన్నీ కుళ్ళు బుద్ధులట! వాళ్ళో, వాళ్ళ పెళ్ళాలో చీటికీ మాటికీ వచ్చికూర్చుని "ఈ దుద్దులెక్కడివి? ఈ గాజు లెప్పుడు చేయించారు? ఈలోగా ఎన్నిచీరలు కొన్నారు?' అంటూ ఒకటే వూదర పెట్టేస్తారట! ఏం చెయ్యాలి చెప్పండి. స్వర్గానికి వెళ్ళినా సవతిపోరు

తప్పదేః అందుకని ఎప్పుడైనా మెడలో నెక్లెసు పెట్టుకోవాలనిపిస్తే పద్మక్క యెకాయెకిన పుట్టింటికి వెళ్ళిపోయి వారం పదిరోజు లుండి వస్తుందటః''

కానీ నెక్లెసు వేసుకునే మోజు తీర డంకోసం పద్మక్క అలా ఎంతోకాలం పుట్టింటికి యాత్రలు సల్పే అవసరం లేక పోయింది. అపాటికే హోటలు వ్యాపారం స్తంభించిపోయే స్థితికి వచ్చింది. ఒక్కొక్కరుగా భాగస్వాములందరూ తెగ తెంపులు చేసుకున్నారు. చివరికొక్క చలపతి మాత్రం మిగిలాడు. అతడు గూడా మిగిలివున్న బెంచీలు, కుర్చీలు, బల్లలు, పాత్రసామగ్రీ అయినకాడికీ తెగనమ్మి శనగలు తిని చేయి కడుక్కున్నట్టుగా హోటలుకు తగిలించిన నేమ్ బోర్డు తీసి రిక్షాలో వేయించుకుని చక్కా యింటికొచ్చేశాడు.

నాలుగైదువేల రూపాయల కిమ్మత్తు చేసే స్కూటరుపైన బలాదూర్లు తిరుగుతూ చలపతి ఎప్పుడైనా నా కెదురయ్యేవాడు. ఎదురైనప్పుడల్లా 'నెక్స్ట్ అయిటం ఆఫ్ ది ప్రోగ్రాం ఏమిటి బాబూ?'' అని అడగాలనిపించేది.

అడగని పాపం నాది. తనంతట తానే చెప్పేశాడు చలపతి

చూడ్డానికి చాలా సాధారణమైన విషయం. వెనక ఎంతో అసాధారణమైన వ్యూహం. మనుషులపైన సూదంటు రాయిలాంటి ఆకర్షణ. ఈ శుభలక్షణాలన్నీ చలపతి పథకానికి అన్వయించేవే.

ప్రతి మెంబరూ చెల్లించవలసిన మొత్తం రెండువందలేః అంతా వొకటే సారిగా ప్రారంభంలో చెల్లించాలి. మొత్తం మెంబర్ల సంఖ్య వెయ్యినీ ఏడువందలయాభై, నెల వొకటికి పదింటి చొప్పున ఆరు సంవత్సరాల పొడుగునా బహుమతు లుంటాయి. మొదటి నెల మొదటి బహుమతి అంబాసిడర్ కారు. చివరినెల చివరి బహుమతి గూడా ఆరు వందలకు తగ్గదు. ఈ దెబ్బయిరెండు నెల్లోనూ ప్రయిజుకు నోచుకోని వాళ్ళకు ప్రణాళికాంతంలో అయిదువందల రూపాయలు నగదుగా యివ్వబడుతుంది. అంచేవల్ల వొకటి ముప్పాతిక వేల మంది మెంబర్లలో వొక్కడికైనా నష్టమన్న మాటే లేదుః

''ఎలావుందండీ కృష్ణమూర్తిగారూః'' అన్నాడు చలపతి.

చాలా బాగున్నట్టు వొప్పుకొన్నాను.

''మాట చెబితే చాలదు. మీరు మెంబరుగా చేరాలి. మీ ఆఫీసువాళ్ళను చేర్పించాలి. ఇప్పటికే వెయ్యిమందిని చేర్పించేశాను. అసలీ స్కూటరు కొనడం లోని వుద్దేశం అదేః''

ఒక రూపాయ పెట్టుబడితో లక్షలు వచ్చి జేబులో పడిపోవడం తథ్యమేనని కలలుగనే వాళ్ళు లోకంలో బోలెడు మంది వున్నారు. లాటరీలు, చిట్ ఫండులు, ఫైనాన్స్ కార్పొరేషన్లు, మనీ

"హలో పోలీస్‌స్టేషనాండీ? నా పేరు అప్పారావండీ మా ఆవిడ తప్పిపోయిందని రిపోర్టు యివ్వాలగదండీ....యిహ. మీరు శ్రమ పడకండి."

"ఏం, మీ ఆవిడ దొరికిందా?"

"అహ. లేదనుకోండి. కాని, నా మనస్సు మార్చుకున్నాను."

సర్క్యులేషన్లు మొదలైన వాటితో చక్కిలి గింతలు పెట్టగా, పెట్టగా ధనలక్ష్మి శరీరం స్పర్శకతీతంగా మొద్దు బారి పోయే వుంటుంది. ఈ పరిస్థితిలో చలపతి తల పెట్టిన పథకం దిగ్విజయంగా కొనసాగ గలదనడానికి ఎలాంటి అభ్యంతరము కనిపించదు.

ఆరేండ్ల బృహత్ప్రణాళిక ప్రారంభ మైంది. ఇంకా పూర్తి కాలేదు.

రెండేళ్ళ క్రిందట చలపతి చావడి వీధిలో ఒక యింటి జాగ కొన్నట్టు తెలిసింది. ఇల్లు నిర్మాణదశలో వుండగా ఒకసారి మా శారద పద్మక్కతో బాటు వెళ్ళి చూచి వచ్చింది గూడా!

పద్మక్క ఇంగ్లీషు చదువులు చదువు కోలేదట. పట్టణవాసం వల్ల ఆమె నేర్వ గలిగిన కొద్దిపాటి యింగ్లీషు పదాల్లరీకి ఖర్త కడుతున్న యిల్లు పుణ్యమా అని బాల్కనీ, పోర్టికో, బాత్‌రూము, వెయి టింగురూము. కిచెను. డైనింగు హాలు అంటూ కొంత కొత్త పదజాలం చేరిం దట! మురిసిపోతూ చెప్పింది శారద.

"ఎన్నిసార్లు పిలిచినా మనమిద్దరం కలిసివెళ్ళనే లేదు. గృహప్రవేశానికైనా తప్పకుండా మిమ్మల్ని తీసుకరమ్మంది. అప్పటికేదైనా అడ్డుమాట చెప్పారో, ముఖం చిన్నబుచ్చుకుంటుంది. ఆవిడసలే మెతకమనిషి!

కానీ దేనికైనా ప్రాప్తం వుండొద్దా? మా దురదృష్టాని కొకర్ని నిందించి ఏంలాభం? గృహప్రవేశానికి మేము జంటగా వెళ్ళలేకనే పోయాము.

కొంతనాలుకకు పెడితే అసలు నాలుక గూడా వూడిపోయిన చందంగా గృహ ప్రవేశ మహోత్సవానికి శారద ఒంటరిగానైనా హాజరు కాలేక పోయింది.

వెళ్ళడానికి వీల్లేకుండా ఈలోగా ఒక ...ఒక...ఏమనాలో తోచడం లేదు దాన్ని! సంఘటన అంటే చప్పగా వుంటుంది, తమాషా అంటే వ్యతిరేకార్థం వస్తుంది. వైపరీత్య మంటే చలపతికి కోపం రావచ్చు,

జరిగింది జరిగినట్టుగా చెప్పేయడం మంచిది.

ఎప్పుడో అయిదారు నెలలకొక సారి గానీ నాకు చావడి వీధిగుండా వెళ్ళవలసిన పని తగలదు. నిర్మాణం పూర్తయిన క్రొత్తలో నే నొకసారి ఆవీధి గుండా వెళ్తూ చలపతి యింటి వైపు చూచాను. అది అక్కడి కక్కడ పునాదులు తీసి, యిటుకలతో గోడలు కట్టి, పైకప్పువేసి, సిమెంటుతో పూత పనిచేసి, రంగులు కొట్టి, యిలా వివిధ దశలద్వారా రూపొందిన కట్టడంలా తోచడంలేదు. హఠాత్తుగా చూచినట్టయితే ఏమాంబళం నుంచో, ఏపంజగుట్ట నుంచో అలాగే పెళ్ళగించు కొచ్చి యిక్కడ పెట్టేసిన బంగాళాలా కాన వస్తోంది,

చలపతి యిల్లుకట్టి చూచాడు. చాలా బాగా కుదిరింది. కొత్త యింట్లో తన జీవితమంతా ఒక కొత్త తరహాలోనే నడవాలని ఆశించాడు. అందువల్ల కొత్త యింట్లోకి గూడా పాతపెళ్ళాన్నే తెచ్చుకోడం అతడికి చాలా అసంగత మైన విషయంగా తోచింది. ఏనాటి అనుబంధమో తెలియదు. డ్రామాల్లో చలాకీ పాత్రలు ధరించే ఓ అమ్మాయి మెడలో అతడు పుస్తె కట్టేశాడు. ఆమెను తీసుకొచ్చి నూతన గృహంలో ప్రతిష్ఠించి, కొత్త కాపురమనే నావకు జోరుగా లంగరెత్తేశాడు!

తిట్టిన తిట్టు చర్వితచర్వణంగా కుండా తిట్టి పోసింది శారద. రోజుల తరబడీ తిట్టింది. గ్రహచారంచాలక చలపతి గనుక మావీధిలో కనిపించి వుంటే చేరెడు దుమ్మెత్తి అతడి తలపైన దిమ్మరించి వుండేది గూడా!

భార్యా భర్తల్లో ఒకరి అభిప్రాయాలను యింకొకరు విధిగా సమర్థించి తీర వలసిందే నంటూ చట్టమేమీ లేనట్టయితే నేనిక్కడొక మనవి చేసుకోవలసి వుంది. చలపతి పై అధికారులను మోసగించాడు. ప్రభుత్వాన్ని దగా చేశాడు. వ్యాపారంలో వాటాదారుల్ని వంచించాడు. ప్రజల్ని దోచాడు. ఐతే యిదంతా మా శారదకు సహజమైన వ్యవహార సరళిగానే తోస్తూ వచ్చింది. మరైతే యిప్పుడతడు రెండో పెళ్ళి చేసుకున్నందువల్ల ధర్మానికి కొత్తగా కలిగిన హాని ఏముందో నాకు తెలియడంలేదు. శారదకు చలపతిపైన యిలా ఆగ్రహం కలగడంలో ఔచిత్య మేమిటో నాటికీ, నేటికీ నాకు బోధపడలేదు!

— — —